క్లుప్తంగా

'భారీ మెజార్టీతో గెలిపించాలి'

డొంకేశ్వర్(ఆర్మూర్): ధర్మపురి అర్వింద్‌కు బీజేపీ అధిష్ఠానం రెండోసారి ఎంపీ టికెట్ ఖరారు చేయడం పట్ల బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్ హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో రైతులు, విద్యార్థులు, మహిళలు అన్ని వర్గాల ప్రజలు మళ్లీ అర్వింద్‌కే ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అర్వింద్‌కు కేంద్రంలో మంత్రి పదవి వస్తే నిజామాబాద్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

న్యాయవాది దినేష్‌కు జాతీయ స్థాయి అవార్డు



బోధన్: ఖండ్‌గాంకు చెందిన సీనియర్ న్యాయవాది బోధన్ కోర్టు ఏజీపీ జి. శ్యాంరావు కుమారుడు హైకోర్టు న్యాయవాది, వీరశైవ లింగాయత్, లింగ బలిజ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేష్ పాటిల్ సామాజిక, న్యాయ సేవలకు జాతీయ స్థాయి అవార్డు దక్కింది. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన స్వచ్ఛంద సంస్థ గ్లోబల్ స్కాలర్ ఫౌండేషన్ సామాజిక సేవలందిస్తున్న వివిధ రంగాల వారికి ప్రతిష్టాత్మకంగా అందించే జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ మేరకు మేరకు దినేష్ పాటిల్ దరఖాస్తు చేసుకున్నారు. ఆయన సామాజిక, న్యాయపరంగా అందించిన సేవలను గుర్తించి డైమండ్ ఆఫ్ ఇండియా అవార్డుకు సంస్థ ఎంపిక చేసింది. ఆదివారం పుణే నగర కేంద్రంలో అవార్డుల ప్రధానోత్సవ వేడుకల్లో దినేష్ పాటిల్ పద్మశ్రీ అవార్డు గ్రహీత మిలింద్ కాంబ్లే చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. గతంలో దినేష్ వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవా రత్న, బసవ రత్న, ఏపీజే అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డులు అందుకున్నారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని హైకోర్టు న్యాయవాది తెలిపారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ నియామకం



మాక్లూర్: బొంకన్‌పల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీని ఆదివారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవి ప్రకాష్ నియమించారు. అధ్యక్షుడిగా రాముల నరేష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా అలాల్ ఒడ్డెన్న, సభ్యులుగా నక్క పోశెట్టి, ఎండీ హిమామొహిద్దీన్, టి సాయిలు, మోహిన్, ప్రమోద్, ఎస్ నరేష్, తదితరును నియమించినట్టు పార్టీ మండల అధ్యక్షుడు రవి ప్రకాష్ తెలిపారు.

కరాటేలో బోధన్ విద్యార్థుల ప్రతిభ



బోధన్: సౌత్ ఏషియన్ కరాటే -2024 చాంపియన్‌షిప్ పోటీలో బోధన్‌కు చెందిన ఒకినోవా కరాటే సంస్థ ముగ్గురు విద్యార్థుల పాల్గొని ప్రతిభ చాటారు. ఆదివారం హైదరాబాద్‌లో కల్యాణి కరాటే అకాడమీ ఆధ్వర్యంలో సౌత్ ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొన్న బోధన్(అండర్ -12) విద్యార్థులు మహవీర్, సుమిత్ , అక్షయ్‌లు కరాటే వివిధ విభాగాల్లో ప్రతిభ చాటి గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాలను సాధించారు. నిర్వాహకుల చేతుల మీదుగా అవార్డులందుకున్నారు. ఈ విషయాన్ని కరాటే మాస్టర్ అశోక్‌రోడే తెలిపారు.

ఉచిత కరెంట్ అందే విధంగా చర్యలు చేపట్టాలి



వర్ని: మండల కేంద్రంలో గృహలక్ష్మి పథకం అమలు తీరుతెన్నులను వర్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మీ వీర్రాజు ఆదివారం పరిశీలించారు. విద్యుత్ ఉద్యోగులు జీరో కరెంట్ బిల్లు తీస్తున్న విధానాన్ని పరిశీలించి పథకం సక్రమంగా అమలు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్ది పేదలకు లబ్ధి చేకూర్చాలని ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే మండల కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

విజయవంతంగా పల్స్ పోలియో


బోధన్ జిల్లా ఆస్పత్రిలో.. జెడ్పీ చైర్మన్ విఠల్ రావు


బోధన్ కొత్త బస్టాండ్‌లో.. జిల్లా ఉపవైద్యాధికారి


సాలూర మండల కేంద్రంలో.. ఎంపీటీసీ సవిత


వేల్పూర్‌లో పోలియో నివారణ చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

సాక్షి నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. వారం రోజుల ముందు నుంచే పల్స్ పోలియో కార్యక్రమం గురించి వైద్యారోగ్య సిబ్బంది ప్రచారం చేశారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు సమన్వయంతో ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్క లు వేశారు. వైద్యాధికారులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వేల్పూర్ మండల కేంద్రంలో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ పట్టణంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, బోధన్ జిల్లా ఆస్పత్రిలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు తదితరులు పల్స్ పోలియో కార్యక్రమాలను ప్రారంభించారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు కచ్చితంగా పోలియో నివారణ చుక్కలు వేయించాలని వారు సూచించారు.


ఆర్మూర్ పట్టణంలో .. ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి


కొటార్మూర్‌లో ..


బాల్కొండ మండల కేంద్రంలో..


రాయకూర్‌లో .. ఎంపీటీసీ అనిల్ పటేల్


రుద్రూర్ మండల కేంద్రంలో ..



మోస్రాలో .. జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి


సాలూర అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద ..


ముప్కాల్ మండల కేంద్రంలో..


ఎడపల్లిలో .. జెడ్పీవైస్ చైర్‌పర్సన్ రజితాయాదవ్


కోటగిరిలో .. ఎంపీటీసీ మనోహర్


రెంజల్ ఆస్పత్రిలో.. ఎంపీపీ రజని, జెడ్పీటీసీ విజయ


ఆర్మూర్ బస్టాండ్‌లో .. డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్


కమ్మర్‌పల్లిలో..


డొంకేశ్వర్‌లో..

ఆలయాలను రక్షించుకోవడం హిందువుల ధర్మం

మాక్లూర్: ఆలయాలను రక్షించుకోవటం హిందువుల ధర్మమని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. ఆదివారం మాణిక్‌బండార్‌లో జరిగిన మహాలక్ష్మీదేవి ఆలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇతర మతాలకు చెందిన కొందరు, హిందూ దేవుళ్లను కించపరుస్తూ, అవసరమైతే కూలుస్తూ హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. దాడులు జరుగుతున్నా చర్యలు తీసుకోలేని పరిస్థితుల్లో రాష్ట్రంలో ప్రభుత్వం ఉందన్నారు. ఆదివాసి నాయక్‌పోడ్ సేవా సంఘం మండల యూత్ అధ్యక్షుడు ఆకుల సతీష్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు

ఆర్మూర్: పట్టణ కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత కన్యకా పరమేశ్వరి దేవాలయ 17వ వార్షికోత్సవ సందర్భంగా కుంకుమ పూజ, చండీయాగం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా హిందువులందరు ఏకతాటిపైకి రావాలని, హిందూ ధర్మం కోసం కృషి చేయాలని కోరారు. ఆర్మూర్ పీఎంపీ భవనంలో మండల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ డైరీ, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆవిష్కరించారు.

సాలంపాడ్ క్యాంప్ సేవా సొసైటీ ఏర్పాటు

బోధన్: సాలంపాడ్ క్యాంప్ గ్రామ సేవా సొసైటీని ఏర్పా టు చేసినట్లు సేవా సొసైటీ అధ్యక్షుడు ఏరువ జస్వంత్ రెడ్డి తెలిపారు. తాత్కాలికంగా కార్యవర్గ సభ్యులను ఎ న్నుకున్నట్లు చెప్పారు. ఉపాధ్యక్షుడిగా కామిరెడ్డి అశోక్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎడమకంటి వెంకట్రామిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా బ్రహ్మతేజ కుమార్ రెడ్డి, కోశాధికారిగా కామిరెడ్డి హరికృష్ణా రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులుగా గూడాల ప్రదీప్ రెడ్డి, ఎడమకంటి అంజిరెడ్డిలను ఎన్నుకున్నారు. సాలంపాడ్ క్యాంప్ గ్రామాభివృద్ధికి తోడ్పడుతూ సేవా కార్యక్రమాలు, పండుగల సమయంలో సాంస్కృతిక కార్యక్రమా లు, క్రీడలు నిర్వహించాలనే లక్ష్యంతో సొసైటీని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు జస్వంత్ రెడ్డి తెలిపారు. అలాగే మల్టీపర్పస్ గ్రౌండ్ ఏర్పాటుకు రేపటి(మంగళవారం) నుంచి విరాళాలు సేకరించాలని సంకల్పించినట్లు వెల్లడించారు. దాతలు స్వచ్ఛందంగా విరాళాలు ఇవ్వవచ్చని అన్నారు.


జస్వంత్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు

ప్రజల హక్కులను కాపాడాలి


బయలుదేరుతున్న ఆర్మూర్ నాయకులు

అర్మూర్‌టౌన్/కమ్మర్‌పల్లి: ప్రజల హక్కుల కాపాడానికి అందరం కలిసికట్టుగా పోరాడి బలమైన శక్తిగా ఎదగాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆర్మూర్ సబ్ డివిజన్ కార్యదర్శి కిషన్ అన్నారు. ఖమ్మంలో జరుగుతున్న సీపీఐఎంఎల్ ప్రజాపంథా, సీసీఐఎంఎల్ పీసీసీ, సీపీఐఎంఎల్ ఆర్ఐ పార్టీల విలీన మహా సభలకు ఆర్మూర్, కమ్మర్‌పల్లి నాయకులు బయలుదేరారు. ఈ సందర్భంగా ప్రజల తరఫున బలంగా ప్రశ్నించడానికి, మతోన్మాద ప్రభుత్వాన్ని ఢీకొట్టడానికి విలీన మహాసభలను నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. నాయకులు మచర్ల రాజన్న, ఠాగూర్, ఆకుల గంగన్న, వి. ప్రభాకర్ పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లిలో బస్సులను ప్రారంభిస్తున్న ప్రభాకర్

లీకేజీలు యథాతథం

మోర్తాడ్(బాల్కొండ): మండలంలోని వివిధ ప్రాంతాల్లో చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం, మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు లీకై నీరు వృథాగా ప్రవహిస్తోంది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మోర్తాడ్, తిమ్మాపూర్‌ల మధ్య ఉన్న రోడ్డుపై చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ లీకై నీరు వారం రోజుల నుంచి అలాగే ప్రవహిస్తోంది. జాతీయ రహదారి-63 పక్కన మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ లీకై అక్కడ కూడా నీరు ప్రవహిస్తూ బురద గుంట ఏర్పడింది. కొన్ని రోజుల నుంచి నీరు లీకవుతున్నా అటు ఇరిగేషన్ శాఖ అధికారులు గానీ ఇటు గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖ అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. తక్షణమే స్పందించి లీకేజీలను సరి చేసి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.


మోర్తాడ్- తిమ్మాపూర్ రోడ్డుపై లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ నీరు


జాతీయ రహదారి పక్కన నీరు లీకై ఏర్పడిన బురద గుంట

మన ఊరు - మన బడి ఇంతేనా!

- రెండేళ్లు కావస్తున్నా టెండర్ కాని వైనం
- ముందే హడావుడిగా శంకుస్థాపన చేసిన అప్పటి మంత్రి వేముల
- రెంజర్ల ప్రాథమిక పాఠశాల పరిస్థితి

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల ప్రాథమిక పాఠశాలలో మన ఊరు- మన బడి పథకం కింద చేపట్టాల్సిన పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాకపోవడంతో మన బడి ఇంతేనా అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం మన ఊరు- మన బడి పథకంలో భాగంగా ప్రభుత్వం రూ.34 లక్షలు మంజూరు చేసింది. 2022, మే నెలలో అట్టహాసంగా పనులకు శంకుస్థాపన చేశారు. మన ఊరు- మన బడి పథకంలో రూ.10 లక్షల కంటే తక్కువ ఉంటే టెండర్ లేకున్నా ఎస్ఎంసీ కమిటీ తీర్మానంతో పనులను కాంట్రాక్టర్లకు అప్పగించవచ్చు. కాని అంత కంటే ఎక్కువగా ఉంటే తప్పనిసరిగా టెండర్ నిర్వహించాలని నిబంధన ఉంది. కానీ అవేమి పట్టించుకోకుండా టెండర్ కాకున్నా శిలాఫలకం వేసి శంకుస్థాపనలు నిర్వహించారు.


దర్శనమిస్తున్న మొండి గోడలు

ఇప్పుడేమో పనులు చేయటానికి ఎవరూ ముందుకు రావడం లేదంటూ రెండేళ్లుగా చెబుతున్నారు. అసలు టెండర్ కాక ముందు శంకుస్థాపన ఎలా చేస్తారు.. చేసిన తర్వాత టెండర్ వేయటానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదంటూ ఎన్నాళ్లు చెబుతారంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు రెండు అదనపు గదులు నిర్మించటానికి కూడ నిధులు మంజూరయ్యాయి. కాని గదులు లేవు, వసతులు లేవు. పాఠశాలలో 80 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాలుగు గదులతోనే వెళ్ల దీస్తున్నారు. ఉన్నతాధికారులకు, పాలకులకు రెండేళ్లుగా మొర పెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడు. మారిన ప్రభుత్వ పాలకులు అయినా పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉమ్మడి బాల్కొండలో..

ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలోని పలు గ్రామాల్లో మన ఊరు- మన బడి ద్వారా చేపట్టవలసిన పనులు ప్రారంభానికి నోచుకోలేదు. కారణం పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. పాత ఎస్ఎల్ఆర్ రేట్ల ప్రకారం నిధులు కేటాయించడం, అన్ని కూడా మౌలిక వసతుల పనులు ఉండటంతో కాంట్రాక్టర్లు నష్టపోతామని భావించి ముందుకు రావడం లేదని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు

మన ఊరు - మన బడి పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. రెండేళ్లుగా టెండర్ ప్రకటిస్తూనే ఉన్నాం. ఇప్పటి వరకు ఎవరు ముందుకు రాలేదు. ఎవరన్నా చేయడానికి వస్తే పనులు అప్పగిస్తాం.

– షరీఫ్, పంచాయతీరాజ్ ఏఈఈ, బాల్కొండ

గృహజ్యోతి అమలు.. కాంగ్రెస్ సంబరాలు


అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాక్లూర్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలలో భాగంగా గృహజ్యోతి పథకాన్ని అమలు చేయడంతో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ప్రజలతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. అధికారులు జీరో బిల్లులు తీసి ఇవ్వటంతో మాక్లూర్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక కాంగ్రెస్ నాయకులు విద్యుత్ సిబ్బందితో కలిసి జీరో బిల్లుల విషయమై ప్రజలకు వివరించి చెప్పారు. ఏడీ అశోక్, మాక్లూర్ ఏఈ గోపినాయక్, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం



వేల్పూర్: పోచంపల్లిలో ముత్యాల పోచమ్మ 16వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి రథోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముత్యాల పోచమ్మ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమై ఆదివారం విగ్రహాల ఊరేగింపు, కల్యాణం, రథోత్సవంతో ముగిశాయి.

ఆలయానికి రూ.లక్ష విరాళం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో నిర్మిస్తున్న అయ్యప్ప దేవాలయానికి స్థానిక దాత ఏలేటి బాల్‌రెడ్డి, స్రవంతి దంపతులు రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఆదివారం దంపతుల కుమార్తె భవ్యంతి చేతుల మీదుగా అందించగా, ఆలయ కమిటీ సభ్యులు రసీదు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్‌రెడ్డి, కొమ్ముల శ్రీనివాస్‌రెడ్డి, తీగల హరీష్‌రెడ్డి, శేఖర్ తదితరులున్నారు.



జర్నలిస్ట్ కాలనీలో శ్రమదానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ కాలనీ- సమైక్య కాలనీ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం నిర్వహించారు. రోడ్డు నెంబర్ 9, 11 వరకు పరిసరాలను పరిశుభ్రం చేశారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, శివరాజ్ కుమార్, బి.కమలాకర్, సుంకె శ్రీనివాస్, కొక్కెర భూమన్న, కొంతం రాజు, ఎల్.సాయన్న, ఎ.లక్ష్మయ్య, ఎస్సారెస్పీ డీఈ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 -	మా ఊరి రాజారెడ్డి - 10.30 వ్యూహం (తెలుగు) - 1.00 ఊరు పేరు భైరవకోన - 3.45 ముఖ్య గమనిక (తెలుగు) - 7.00 కిక్ (తెలుగు) - 9.45
స్క్రీన్-2 -	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 12.15, 3.10, 6.05, 9.00
స్క్రీన్-3 -	ఊరు పేరు భైరవకోన (తెలుగు) - 12.45, 10.00 హనుమాన్ (తెలుగు) - 3.45 ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు)-7.05
స్క్రీన్-4 -	ఇంటి నెంబర్ -13 - 10.45 చారి-111(తెలుగు) - 1.30, 7.20 భూతద్దం భాస్కర్ - 4.20, 10.10